క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూ నగర్: డయల్ యువర్ కమిషనర్(0863–2224202) కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కమిషనర్ చాంబర్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

స్టాంపింగ్ ధరలు పెంపుపై అవగాహన



నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తూనికలు, కొలతలు శాఖ(లీగల్ మెట్రాలజీ) ఆధ్వర్యంలో పరికాల స్టాంపింగ్ రేట్లు పెంచడం జరిగిందని, దీనిపై అవగాహన కలిగి ఉండాలని ఆ శాఖ డెప్యూటీ కంట్రోలర్ బి.వెంకట హరిప్రసాద్ తెలిపారు. ఆదివారం నగరంలోని ఆ శాఖ కార్యాలయంలో కాటాలు, వెయింగ్ మిషన్ల రిపేరర్లు, మ్యానుఫ్యాక్చరర్లు, డీలర్లుతో ఫీజులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పెరిగిన ఫీజులకు అనుగుణంగా వ్యాపారస్తులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్.అల్లూరయ్య, ఇన్‌స్పెక్టర్ సునీల్‌రాజు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ



నగరంపాలెం: వయో వృద్ధులు, దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా సహాయం అందించాలని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ అన్నారు. కొత్తపేటలోని సమితి కార్యాలయంలో ప్రతి నెల రెండో ఆదివారంలో భాగంగా వయో వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, 11 రకాల నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో కూలీ పనులు చేయలేక ఎందరో అర్ధాకలితో జీవిస్తున్నారని అన్నారు. అటువంటి వారికి తమ వంతుగా చేయూతను అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉచిత బియ్యం కమిటీ చైర్మన్ పోలేపల్లి వెంకటసుబ్రహ్మణ్యం, కోశాధికారి ఎస్వీ రమణ, పల్లం పాటిర జనీశ్వరరావు, పలకలూరి శివరావు, మామిడి వెంకటశ్రావణ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెకు సీపీఎం మద్దతు

లక్ష్మీపురం: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది కాలంగా మున్సిపల్ కార్మికులు ప్రత్యేకించి ఇంజినీరింగ్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని వివిధ రూపాల్లో ఆందోళన నిర్వహించినట్లు చెప్పారు. సమస్యలు పరిష్కరించకపోతే జూలై 12వ తేదీ అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లనున్న సమ్మె నోటీసు ఇచ్చారని గుర్తు చేశారు. అయినప్పటికీ వారి సమస్యలు పరిష్కారం చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మె నోటీసు ఇచ్చిన అనంతరం అయినా సమస్యల పరిష్కారానికి తగిన చొరవ చూపించలేదని, పైగా సమ్మె ప్రారంభం అయిన తర్వాత అధికారులను, అధికార పార్టీ పెద్దలను వినియోగించుకొని సమ్మె చేస్తున్న కార్మికులను అదిరించి, బెదిరించి, లొంగదీసుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుందని చెప్పారు. ఇలాంటి చట్ట విరుద్ధమైన చర్యలకు ప్రభుత్వం పాల్పడటం సరైంది కాదని, తక్షణమే యూనియన్ నాయకులతో చర్చించి వారి సమస్యలు పరిష్కారం చేసి, సమ్మె విరమింపజేసేందుకు తగు చర్యలు చేపట్టాలని నేతాజీ డిమాండ్ చేశారు.

శాకంబరి దేవీగా అంకమ్మతల్లి



నగరంపాలెం: పాతగుంటూరు శ్రీఅంకమ్మతల్లి దేవస్థానంలో అమ్మవారిని ఆదివారం శాకంబరి దేవీగా అలకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను ఆలయ నిర్వాహకులు అందించారు.

కేబుల్, నెట్ వైర్ల చిక్కుముడి

- నడిరోడ్లపై వేలాడుతున్న పరిస్థితి
- తరుచూ ప్రమాదాలు
- పలుమార్లు షార్ట్‌సర్క్యూట్
- పట్టించుకోని అధికారులు

పట్నంబజారు: నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు.. కనీసం విచక్షణ లేకుండా ప్రజలు ఇబ్బందులు పాలవుతున్నా.. తమకేమి పట్టనట్లు కేబుల్, నెట్ నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. గుంటూరు నగరంలో ఎక్కడబడితే అక్కడ కేబుల్ వైర్లు వేలాడుతున్న పరిస్థితుల్లో.. పలు ప్రమాదాలు జరుగుతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇటీవల కాలంలో పాతగుంటూరులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఒక విద్యార్థి సైకిల్‌పై వెళ్తూ.. కేబుల్ వైర్ చక్రంలో ఇరుక్కుని కింద పడి గాయాపాలైన పరిస్థితి ఉంది. ఇటువంటి పరిస్థితులు ఏర్పడుతున్నా.. కనీసం కేబుల్, నెట్ నిర్వాహకులు ఏ మాత్రం పట్టకుండా ఇష్టానుసార ధోరణితో వ్యవహరిస్తున్నారు.





నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న కేబుల్, నెట్ వైర్లు

స్తంభాలకు విచ్చలవిడిగా వేలాడదీస్తూ..

కేబుల్, నెట్ వైర్లు కనీసం 15 నుంచి 20 అడుగుల ఎత్తులో విద్యుత్ స్తంభాల పైన కడుతారు. నగరంలో మాత్రం ఆ ప్రాంతం.. ఈ ప్రాంతం అనే బేధం లేకుండా.. కేబుల్, నెట్ వైర్లు కేవలం అడుగు నుంచి మూడు అడుగుల లోపు ఎత్తులో మాత్రమే కడుతున్న పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇంటి గోడలకు.. అడుగు ఎత్తులో విద్యుత్ స్తంభాలకు కట్టేసి... స్థానిక ప్రజలను ప్రమాదంలో నెట్టేసి తమ చేతులు దులుపుకుంటున్నారు. దీనితో వైర్లు వేలాడటంతో పాటు అనేక ప్రమాదాలకు తావిచ్చినట్లు అవుతోంది.



విద్యుత్ స్తంభాల వద్ద మరీ ఘోరం...

విద్యుత్ స్తంభాల వద్ద కుప్పలు కుప్పలుగా వైర్లు ఉండడం, వీటికి ఆనుకొని కొన్ని చోట్ల చెట్ల కొమ్మలు ఉంటున్నాయి. కొద్దిపాటి చినుకులు పడినా.. ఈదురు గాలులు వీచినా ఈ వైర్లు ఒకదానికొకటి పైనున్న విద్యుత్ వైర్లకు అంటుకొని విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సమస్యలకు కారణమవుతున్నాయి. నగరంలోని అనేక ప్రాంతాల్లో ఇటువంటి సమస్యలు తరుచూ వస్తూనే ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో వైర్లు వేలాడూ ఇబ్బందులు పడుతున్నామని, స్థానికులు విద్యుత్ శాఖ సిబ్బందికి చెబుతున్నప్పటికీ వారు కనీసం పట్టించుకోకపోవటం గమనార్హం. విద్యుత్ స్తంభాలకు ప్రైవేట్ వైర్లు ఉండకూడదన్నది నిబంధన. ఉంటే వారికి ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఎదో కొద్ది మొత్తంలో పన్ను చెల్లించి ఇష్టారాజ్యంగా వైర్లు వేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. విద్యుత్ సిబ్బంది మాత్రం పట్టించుకోవటం లేదు. వాటిని తొలగించాల్సిన పరిస్థితుల్లో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ఈదురు గాలులు వచ్చిన ప్పుడు కేబుల్, నెట్ వైర్లు తెగి, విద్యుత్తు తీగలపై పడి విద్యుత్తుకు అంతరాయం కలుగుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఈ క్రమంలో విద్యుత్తు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని నగర మేయర్ కోవేలమూడి రవీంద్ర తెలిపారు. ఆదివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 42వ డివిజన్లో రూ.53 లక్షలతో నవభారత్ నగర్‌లో సిమెంట్ డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో ప్రజావసరాల దృష్టిలో పెట్టుకొని స్థానిక ఎమ్మెల్యే గళ్లా మాధవి పలు అభివృద్ధి పనులు చేయడానికి కృషి చేస్తున్నారన్నారు. వార్డుల వారీగా మౌలిక వసతుల కల్పనలో స్థానిక ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకొని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. గుంటూరు నగరంతో పాటు నగరంలో విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు పార్టీల కతీతంగా ప్రాధాన్య క్రమంలో నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో వెస్ట్ ఎమ్మెల్యే గళ్లా మాధవి, కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరామ ప్రసాద్, ఈరంటి వరప్రసాద్ పాల్గొన్నారు.

రెటినోపతిని నిర్లక్ష్యం చేయకండి



మాట్లాడుతున్న డాక్టర్ కల్పనా రెడ్డి

గుంటూరు మెడికల్: మధుమేహం, అధిక రక్తపోటు గలవారు నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఆరు నెలలకు ఒకసారి రెటినోపతి పరీక్ష చేయించుకొని దృష్టిని కాపాడుకోవాలని డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రి వైద్యులు రాచపల్లి కల్పనా రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ భవనంలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా రెటినో పతి ఉచిత పరీక్ష, వైద్య సలహా శిబిరంలో డాక్టర్ కల్పనా రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ తాతా సేవ కుమార్ అధ్యక్షత వహించారు. డాక్టర్ మాట్లాడుత అధిక రక్తపోటు, రక్తంలో షుగర్ శాతం అసాధారణంగా అధిక స్థాయిలలో ఉండే వారిలో కంటిలోని రెటీనాలో అనేక అసాధారణ మార్పులు చోటు చేసుకుంటాయన్నారు. వాటిలో రెటినో పతి అత్యంత ముఖ్యమైనది పేర్కొన్నారు. నిర్లక్ష్యం చేస్తే శాశ్వతంగా కంటి చూపును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు .ఎవరిలోనైనా అధిక బీపీ, మధుమేహాలను తొలిసారిగా గుర్తించినప్పుడే రెటినో పతి పరీక్ష చేయించుకోవడం చాలా మంచిదన్నారు. తర్వాత ప్రతి ఆరు నెలలకు ఒకసారి పరీక్ష చేయించుకోవాలన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ప్రజల జీవన శైలిలో వచ్చిన మార్పులు కారణంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై తప్పక దష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ మేనేజర్ పి.నిర్మల రాణి, దంత వైద్య నిపుణుడు చల్లా చైతన్య, డి.సుధాకర్, బి.వంశీకష్ణ, ఎం.షరీన్, ఆర్.ప్రమీల, డి.వనశ్రీ, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి కె.సతీష్, సభ్యులు చావా శివాజీ, మేకల రామారావు, ఎన్ సాంబశివరావు పాల్గొన్నారు.

క్లబ్‌ల సేవా కార్యక్రమాలు విస్తృతం



నగరంపాలెం: వాసవి క్లబ్ తరుపున సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని వాసవి క్లబ్ అధ్యక్షుడు రాయవరపు అశోక్‌కుమార్ అన్నారు. వాసవి క్లబ్ గుంటూరు, మహిళా గుంటూరు, యువ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఆర్.అగ్రహారం గీతా మందిరంలో 108 మంది వృద్ధులకు ఉచిత బియ్యం, పెన్షన్లు పంపిణీ చేశారు. వాసవి క్లబ్ ఫండ్ రైజింగ్ కమిటి చైర్మన్ పాదర్తి దుర్గారావు మాట్లాడుతూ క్లబ్‌లు నిరంతరం ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాయని అన్నారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కమిటి చైర్మన్ కొల్లిపర దుర్గానాగమణి, క్లబ్ ప్రధాన కార్యదర్శి కూనిశెట్టి చంద్రశేఖరరావు, కోశాధికారి వేమూరి ప్రదీప్‌కుమార్, మున్నలూరి గౌరీశంకర్, కొర్లి వెంకటేశ్వరరావు, గుండా హరిప్రసాద్ అమరా రమేష్, దివ్వెల కోటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

బాలమురళీకృష్ణకు నివాళి



లక్ష్మీపురం: కర్నాటక సంగీత ప్రపంచంలో మహోన్నతుడు, మధురగాన సరస్వతి అపర త్యాగరాజు డాక్టర్ మంగళంపల్లి మురళీకృష్ణ అని విద్యావేత్త, గాయకుడు ఎ.పోతురాజు అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థలో సంస్థ మనమూ పాడుదాం రండి, బృందం ఆదివారం ప్రముఖ సంగీత విద్యాంసుడు బాల మురళీకృష్ణ జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు ఎనిమిది దశాబ్దాల పాటు సంగీత ప్రపచంలో తనదైన శైలిలో ఉర్రూతలూగించిన విశిష్ఠ వాగ్గేగయ కారుడు మంగళం పల్లి అన్నారు. సంగీత విద్వాంసురాలు యార్లగడ్డ లక్ష్మి, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడారు.

అభివృద్ధి సేవా కమిటీ ఎన్నిక

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో మహమ్మదీయ ముస్లిం మైనారిటీ కమ్యూనిటీ హాల్, షాదీ ఖానా అభివృద్ధి సేవా కమిటీ ఎన్నికను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా నూర్ భాష హుస్సేన్, ఉపాధ్యక్షులుగా పఠాన్ మస్తాన్‌వలి, సెక్రటరీగా షేక్ రజాక్, జాయింట్ సెక్రటరీగా షేక్ జానీ, ట్రెజరర్‌గా షేక్ మీర్‌సా సాహెబ్ సహా 15 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. అదే విధంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం దానం చేసిన దివంగత నూతలపాటి పరమేశ్వరరావు కుమారుడు నూతలపాటి త్రిలోక్‌ను గౌరవ సలహాదారుడిగా ఎన్నుకున్నామని సభ్యులు తెలిపారు.

అలరించిన హిందీ సినీ గీతాలు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు

నగరంపాలెం: స్థానిక మార్కెట్ కూడలిలోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం సాయంత్రం ఏషామ్ మస్తాని –16 నిర్వహించారు. ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్, గీతాంజలి ఆర్కెస్ట్రా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని అతిథులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. గాయనీ గాయకులు అమ్మ పండు, పూజ, శరణ్య, నందిని, హేమమాలిని, సింహ, కళ్యాణ్, విజయ్‌సాయి, శ్రీనివాసరావు, ఆచార్య వీర రాఘవలు అనాటి హిందీ సినీ గీతాలను ఆలపించారు. పాడుతా తీయగా ఫేమ్ శ్రీలలిత 'శివ శంకరి' అనే గీతాన్ని ఆలపించగా, ప్రేక్షకులను అలరించింది. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి పి.రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

సన్ సంస్థ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

లక్ష్మీపురం: ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు సేవాభావంతో పేద విద్యార్థులను, అనాథ బిడ్డలను, అంగ వైకల్యంతో విద్యను అభ్యసిస్తున్న ప్రతిభ గల విద్యార్థులకు తోడ్పాటు అందించడానికి స్టూడెంట్స్ యూనియన్ ఫర్ ఇండియా(సన్) చేస్తున్న కృషి అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. ఆదివారం గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం హాలులో సన్ సంస్థ 12వ వార్షికోత్సవం సంస్థ వ్యవస్థాపకుడు యశ్వంత్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013లో ప్రారంభమైన సన్ సంస్థ గత 12 సంవత్సరాలుగా గుంటూరు జిల్లాలో ప్రతిభ గల వందలాది పేద విద్యార్థులకు స్కాలర్ షిప్స్ ఇస్తూ చేయూత అందిస్తుందన్నారు. విద్యార్థి దశలోనే యశ్వంత్, సాయి, ఆదిశేషు లాంటి విద్యార్థులు ముందుకు వచ్చి సన్ సంస్థను స్థాపించి విద్యార్థి లోకానికి ఆదర్శప్రాయులుగా నిలిచారన్నారు. సన్ సంస్థ వ్యవస్థాపకులు యశ్వంత్ ప్రసంగిస్తూ పేద విద్యార్థులకు 5 లక్షల రూపాయల స్కాలర్ షిప్ లను 12వ వార్షికోత్సవ సందర్భంగా అందిస్తున్నామని ప్రకటించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి, హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ – టెక్నాలజీ సెక్రటరీ సిహెచ్.రామకృష్ణ మూర్తి, నేస్తం వ్యవస్థాపకులు జలీల్ అహ్మద్, అపెక్స్ వ్యవస్థాపకులు కె.నాగేశ్వరరావు, సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దిలీప్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు డి.ప్రసాద్, సామాజిక విశ్లేషకులు టి.ధనుంజయ రెడ్డి తదితరులు ప్రసంగించారు. అనంతరం 25 మంది ప్రతిభ గల విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను అందించారు.

కోట మృతి చలనచిత్ర పరిశ్రమకు తీరనిలోటు



కోట శ్రీనివాసరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నగరంపాలెం: ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావు హఠాన్మరణం తెలుగు చలనచిత్ర సీమకు తీరని లోటు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్వర రాగ సుధా ఆధ్వర్యంలో ఆదివారం అరండల్‌పేట 4/1వ అడ్డరోడ్డులోని కార్యాలయ ఆవరణలో సినీ నటుడు కోట శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పించారు. కె.వి.సాయిబాబాశర్మ, పాండురంగారావు, ఆర్‌పీఎల్ నరసింహారావు, సత్యనారాయణ, తూటిపల్లి శ్రీనివాసరావు, అభిమానులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. సినీనటుడు, మాజీ ఎమ్మెల్యే కోట శ్రీనివాసరావు మృతి అభిమానులను దిగ్భ్రాంతికి గురి చేసిందని పలువురు పేర్కొన్నారు. 2012లో కళాదర్బార్ ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన వేడుకల్లో కోట శ్రీనివాసరావుకు జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించినట్లు అధ్యక్షుడు పాత్తూరి రంగారావు గుర్తుచేసుకున్నారు. గొప్ప నటుడు అని, ఆయన లోటు ఎవరూ తీర్చలేరని ఆయన సంతాపం వ్యక్తం చేశారు.

కోట శ్రీనివాసరావు మృతికి సంతాపం

గుంటూరు మెడికల్: తన విలక్షణ నటనతో తెలుగు సినీపరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు పొందిన మాజీ శాసనసభ్యులు, పద్మశ్రీ కోట శ్రీనివాసరావు అకాల మృతికి గుంటూరు బ్రాహ్మణ సేవా సమితి నేతలు ఆదివారం బ్రాడీపేటలోని సమితి కార్యాలయంలో నివాళులర్పించారు. గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న కోట శ్రీనివాసరావు ఆదివారం తెల్లవారుజామున ఫిలింనగర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన అకాల మరణానికి చింతిస్తూ వారి పవిత్ర ఆత్మకు మంచి సద్గతి లభించాలని భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షుడు నందిరాజు పాండురంగారావు, కార్యదర్శి రంగావజ్ఝుల లక్ష్మీపతి, కోశాధికారి తుళ్లూరు ప్రకాష్, ఉపాధ్యక్షుడు మాదల వెంకటకష్ణ, సభ్యులు పాత్తూరి మురళీమోహన్, కేపీ శర్మ, కేవీ సాయిబాబు శర్మ, ఆదిరాజు శ్రీధర్, బి.కృష్ణ ప్రసాద్, వినోద్ కిరణ్ పాల్గొన్నారు.

మరుపురాని నటుడు..

గుంటూరు మెడికల్: ప్రముఖ సినిమా నటుడు కోటా శ్రీనివాసరావు మరణ వార్త వినగానే సినీప్రేక్షకులు, సినిమా నటులు, నిర్మాతలు, దర్శకులు జీర్ణించుకోలేకున్నారని సినీ దర్శకుడు వీరెళ్ల శివనాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కోటా శ్రీనివాసరావు పోషించిన ప్రతి ఒక్క క్యారెక్టర్ ప్రేక్షకుల మనసు లోతుల్లోకి వెళుతోందన్నారు. ఆయన క్యారెక్టర్‌లో జీవించేవారని వెల్లడించారు. మరపురాని నటుడు కోటా శ్రీనివాసరావు మృతికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

కార్మికులపై కక్ష సాధింపు తగదు

లక్ష్మీపురం: శాంతియుతంగా సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం తగదని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు పేర్కొన్నారు. స్థానిక సీఐటీయు కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌కు 2025 జూన్ 12న సమ్మె నోటీసు ఇచ్చామని వివరించారు. చట్ట ప్రకారం సమ్మె నోటీసు ఇచ్చి సమ్మె చేస్తున్న కార్మికులను భయభ్రాంతులకు గురిచేసేందుకు నగరపాలక సంస్థ కమిషనర్ షోకాజు నోటీసులు ఇవ్వటం సరైన చర్య కాదన్నారు. షోకాజ్ నోటీసులు వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

తూర్పులో ఎంఈఓ కార్యాలయమేది!

- తూర్పు, పశ్చిమలకు ఒక్కటే కార్యాలయం
- పరిపాలనా సౌలభ్యం కోసం విభజించిన గత ప్రభుత్వం
- కార్యాలయ ఏర్పాటుపై విద్యాశాఖ నిర్లక్ష్యం



గుంటూరు అర్బన్ ఎంఈఓ కార్యాలయం (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు వేర్వేరుగా ఎంఈఓ కార్యాలయాలను ఏర్పాటు చేయడంలో విద్యాశాఖాధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారు. గుంటూరు అర్బన్, రూరల్ కలుపుకుని ఉమ్మడిగా ఉన్న ఎంఈఓ కార్యాలయాన్ని పరిపాలన సౌలభ్యం కోసం తూర్పు, పశ్చిమ ఎంఈఓ కార్యాలయాలుగా విభజన చేసిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రెండో ఎంఈఓ పోస్టు మంజూరు ద్వారా మండల విద్యాశాఖాధికారులపై పనిభారాన్ని తగ్గించింది. జిల్లా కేంద్రమైన గుంటూరు నగరంలో అర్బన్, రూరల్ పరిధిలో 505 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు వేతనాల బిల్లులు మంజూరు, సర్వీసు విషయాలను ఎంఈఓలే పర్యవేక్షిస్తున్నారు. ఎంఈఓ–2 పోస్టుతో గుంటూరు ఈస్ట్, వెస్ట్‌లలో ఎంఈఓ పోస్టులు నాలుగుకు చేరాయి. నలుగురు ఎంఈఓలు జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వర్తిస్తున్నారు. భౌగోళికంగా ప్రస్తుతం కలెక్టర్ బంగ్లా రోడ్డులో ఉన్న ఎంఈఓ కార్యాలయం వెస్ట్ పరిధిలోకి వస్తుంది. కాగా నలుగురు ఎంఈఓలకు ఒకే కార్యాలయం ఉండటంతో విధుల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గుంటూరు నగరంలో 205 ప్రభుత్వ పాఠశాలలతో పాటు మరో 300 ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యతలు ఒక్క ఎంఈఓ కార్యాలయం నుంచే సాగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో స్టూడెంట్ కిట్‌లను పాఠశాలలకు పంపి, విద్యార్థులకు పంపిణీ చేయడం, పాఠ్య పుస్తకాలను సకాలంలో సరఫరా చేయడంతో పాటు ప్రభుత్వ నిబంధనలను ప్రైవేటు పాఠశాలలు కచ్చితంగా అమలు చేస్తున్నదీ, లేనిదీ పర్యవేక్షించే విధులను ఎంఈవోలు నిర్వహించాల్సి ఉంది. జిల్లా కేంద్రం కావడం, పెద్ద సంఖ్యలో పాఠశాలలు ఉండటంతో తూర్పు నియోజకవర్గంలో ఎంఈఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదు.

ఫిజియోథెరపికి పెరిగిన ప్రాధాన్యం



మాట్లాడుతున్న సీనియర్ ఫిజియోథెరపిస్ట్ లక్ష్మీ లావణ్య

లక్ష్మీపురం: ఫిజియోథెరపి ఒక శారీరక చికిత్స మాత్రమేనని, ఇందులో ఎలాంటి మందుల ప్రమేయం ఉండదని సీనియర్ ఫిజియోథెరపిస్ట్ లక్ష్మీ లావణ్య అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాడీ వ్యవస్థ లోపాలు, కండరాల లోపాలు, శ్వాసకోశ రుగ్మతలు, గుండె సంబంధిత వ్యాధి తదితర సమస్యలు ఉన్నప్పుడు ఫిజియోథెరపి బాగా ఉపకరిస్తుందన్నారు. భౌతిక వ్యాయామం, పరికరాలతో చికిత్స, హైడ్రోథెరపీ, డ్రై నీడ్ లింగ్ తదితర విధానాల ద్వారా ఫిజియోథెరపి చికిత్స అందించవచ్చన్నారు. కాళ్లు, చేతులు చచ్చుబడటం, మూతి వంకర పోవటం, మాట్లాడలేక పోవటం, కళ్లు తెరవలేకపోవటం వంటి లోపాలన్నీ ఫిజియోథెరపి ద్వారా నయం చేయవచ్చన్నారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ లావణ్య చిరోప్రాక్టిక్ సర్దుబాటు, కై రో ప్రాక్టిక్ చికిత్సలను అద్భుతంగా అందిస్తూ అన్ని రకాల నొప్పుల నుండి విముక్తి కలిగిస్తూ అందరి అభిమానం పొందుతున్నారన్నారు. అందులో శాస్త్రీయంగా శిక్షణ పొందారన్నారు. ఆరోగ్య సభలో డాక్టర్ లావణ్యని సంస్థ సభ్యులు సత్కరించారు. ఈ సభలో అనివేమా ట్రస్ట్ అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి, యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్, డాక్టర్ రవీంద్ర కుమార్ ప్రసంగించారు.

రోటరీ ద్వారా సమాజ సేవ



ప్రత్తిపాడు: రోటరీ క్లబ్ ద్వారా విస్తృతంగా సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించవచ్చని రోటరీ సెంటినియల్ గవర్నర్ జాష్టి రంగారావు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ పెదనందిపాడు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ రెయిన్‌బో పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. పెదనందిపాడు రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడు చిన్నం శ్రీనివాసరావు, సెక్రటరీ పోపూరి నాగేశ్వరరావు, ట్రెజరర్ కోడూరి నాగేశ్వరరావుతో పాటు ఆఫీస్ బేరర్లతో రోటరీ గవర్నర్ నామినీ హరిహర ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిధిగా హాజరైన జాష్టి రంగారావు సభ్యులకు అభినందనలు తెలిపారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు చిన్నం శ్రీనివాసరావు, పోపూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. క్లబ్ ద్వారా ఈ ప్రాంత ప్రజలకు సేవ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గరవ్నర్ పోలిశెట్టి రాఘవయ్య, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమొక్రటిక స్టేట్ ప్రసిడెంట్ గొల్లపూడి మోహన్‌రావు పాల్గొన్నారు.